వో రోజు రాత్రి నేను, రాజేంద్ర భోజనంచేస్తున్నాం. రేడియోలో శ్రోతలు రాసిన ఉత్తరాలు ప్రసారం చేస్తున్నారు. అన్న తింటున్న ఇద్దరం ఉలిక్కిపడ్డాం ఆ లేఖ వినగానే.

ప్రసారంకాని రాజేంద్ర నాటిక 'పీశ్నెప్పుడూ ఇంతే'ని నేను పొగుడుతూ రాసిన ఉత్తరం అది.

"ప్రభుత్వకార్యాలయాలలో పనిచేసే కొంటరు అసమర్థులకి ఈ నాటిక నిజంగా గొడ్డలి పెట్టు...."నే రాసిన వాక్యాన్ని అనౌన్సర్ చదివాడు.

# ముగ్గురులో ఒక్కడు

ఒక సినిమా పత్రికలో జర్నలిస్టుగా పనిచేసే మిత్రుడితో "అగ్ని సాక్షి" విడుదలయిన రోజు ఫస్ట్ షోకి వెళ్ళి చూశాను. వివిధ సినిమా పత్రికల జర్నలిస్టులంతా వచ్చారు రివ్యూ రాయడానికి వారందరికి ఉచితంగా మొదటిరోజు సినిమా చూపించడం ఆనవాయితీ.

ఇంటర్వెల్‌లో నా మిత్రుడితో చెప్పాను.

"ఇది ఫలానా పత్రికలో సీరియల్‌గా వచ్చిన 'తలంబ్రాలు' నవల కాపీలా వుంది."

వాళ్ళిచ్చిన కూల్‌డ్రింక్ తాగి సినిమా పూరిగా చూశాను.

"డామిడ్ తలంబ్రాలు నవలని పూరిగా కాపీ కొట్టారు నిర్మాతలు కనీసం శ్రీరాములు పేరుని కూడా ఎక్‌నాలెడ్జ్ చెయ్యలేదు. ఇడియట్స్! మీ సినిమా పక్షులంతా ఇంతే"

"రివ్యూలో ఆ సంగతి రాస్తాను! నీ దగ్గర 'తలంబ్రాలు' నవల ఉంటే ఇవ్వు" చెప్పాడు నా జర్నలిస్టు మిత్రుడు కొద్దిగా సానుభూతితో

* * *

"తెలుగుదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు రచయితఅయితే మిగతా ఇద్దరు పాఠకులు" అన్న వాక్యం ఒక కథలో చదివాను. నేనూ ఒకప్పుడు ముగ్గురిలో ఒకరవాలని ప్రయత్నించినవాడినే. నేను రాసిన పదిహేడు కథలు అన్ని చిత్ర, దిన, వార, పక్ష, మాస పత్రికల నుంచి తిరిగి వచ్చేశాక, ముగ్గురిలో మిగతా ఇద్దరిలో ఒకరుగా స్థిరపడ్డాను

సాహిత్యం అంటే నాకుండే అభిరుచి వల్ల రచయితలతో స్నేహం చేసుకొన్నాను. తరుచు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వారి రచనల గురించి సాహితీ చర్చలు చేస్తూండటం నా హాబీ.

శ్రీరాములు అశేష ఆంధ్ర పాఠకుల అభిమాన యువ రచయిత. ఆయన రాసిన ప్రతినవలా పాఠకులకు నచ్చుతుంది (ఏభై పైబడ్డా ఆయన యువ రచయిత ఎలా అయారో నాకయితే తెలియదు).

మర్నాడు ఉదయం శ్రీరాములు ఇంటికి వెళ్ళి అగ్నిసాక్షి సినిమా గురించి కథతోసహా వివరం చెప్పాను.

"నిజంగా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవున్సార్. కావాలంటే మీరే చూడండి. ఆ నిర్మాతకి లాయర్ నోటీసిప్పించండి, నష్టపరిహారానికి కేసు పెట్టండి" కోపంగా, కసిగా చెప్పాను.

"ముందర నేను చూడాలిగా"

మళ్ళీ మర్నాడు వెళ్ళానుఉదయం వెళ్ళాను శ్రీరాములింటికి.

"తలంబ్రాలు" కథనే పాత్రల పేర్లు మాత్రం మార్చి అగ్నిసాక్షిగా తీశారు ఒప్పుకున్నాడు శ్రీరాములు.

"నోటీస్ ఇస్తున్నారా?" అడిగాను

తల అడ్డంగా వూపాడు విచారంగా, ఉలిక్కిపడ్డాను.

"అదేం?" అడిగాను.

నిజం ఒప్పుకున్నాడు. దిగులుగా నవ్వి సగర్వంగా చెప్పాడు.

"షిడ్నీ షెల్డన్ అనే ఇంగ్లీషు రైటర్ వ్రాసిన రెండు నవలలు కలిపి 'తలంబ్రాలు' రాశాను. నిర్మాత మీద కేసుపెడితే, తనూ ఆ ఇంగ్లీష్ నవలల ఆధారంగా ఆ చిత్ర కథని అల్లానని చెబితే పరువేం కావాలి?"

* * *

ఇప్పుడు నేను ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ముగ్గురిలో ఒకడిని. అంటే అర్థం అయింది కదా?

## ఇల్లు అద్దెకు ఇవ్వబడును

ఆ బోర్డు కామేశ్వరరావు కళ్ళకి కల్పవృక్షంలాగానో, కామధేనువు లాగానో కనపడింది. నల్లటి రంగు పూసిన రేకుమీద తెల్ల అక్షరాల్లో తెలుగులో రాయబడి ఉంది.

"ఇల్లు అద్దెకు ఇవ్వబడును. వివరాలకు మేడమీద"

కామేశ్వరరావు సిటీ బస్‌లోంచి దిగేశాడు. తను దిగాల్సిన బస్ స్టాప్‌లు ఆరు వున్నా ఆ ఇంటి మేడ మెట్లు ఎక్కడో కనుక్కొని సరాసరి పైకెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒక అరవై ఏళ్ళ ముసలావిడ తలుపు తెరిచింది.

"ఎవరు కావాలి?" అడిగింది అతన్ని ఎగా దిగా చూసి.

"ఇల్లు అద్దెకుందని బోర్డు చూశాను...."

ఆవిడ తల వూపి లోపలికి రమ్మన్నట్లు సౌంజ్ఞ చేసింది. ఆవిడ లోపలి గదిలోకి వెళ్ళి అరనిముషంలో ఆవిడకన్నా వృద్ధుడుగా కనిపించే ఒకాయనతో వచ్చింది.

"ఎక్కడ పనిచేస్తున్నావ్?" అడిగాడాయన.

"ఎల్. ఐ. సి లో"

"కూర్చో"